క్లుప్తంగా

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చెన్నారావుపేట : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో మండలంలోని అమృతండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, అమృతండా గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడ నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న తెలిపారు. అధికారులు సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా వెంకట్‌రెడ్డి, నర్సింహ, వెంకన్న పరిశీలించి మాట్లాడారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ డీఈని ఫోన్‌లో ఆదేశించడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాస్కర్, బోడ ధన్‌సింగ్, లైన్‌మెన్ శ్రీనివాస్, శివ, బానోతు వీరాసింగ్, తారాసింగ్, రాజు, వినోద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

ఖానాపురం : ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వరంగల్ రీజియన్ లాజిస్టిక్స్ సేల్స్ టీమ్ లీడర్ రామయ్య కోరారు. మండలంలోని బుధరావుపేటలో టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్, కార్గో పాయింట్‌లను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్గో ద్వారా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలకు త్వరితగతిన సేవలు అందుతాయని చెప్పారు. తక్కువ ధరలకే పార్సిళ్లు చేరుస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆర్టీసీ కార్గో సేవలు అందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో నర్సంపేట డిపో లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నరేందర్, కౌంటర్ ఏజెంట్ షేక్ సలీమ్, జానీ, లింగిడి వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాస్, ఎల్లాగౌడ్, నందగిరి రజని, బాబర్, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన

నయీంనగర్: బాధిత మహిళలు, బాలికలకు అందిస్తున్న సఖి సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో బాధితులకు కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి అందిస్తున్నట్లు లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత వివరించారు. రామప్ప కళాశాల విద్యార్థినులకు సఖి సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్ వర్కర్ హరిత మాట్లాడుతూ పనిచేసే చోట లైంగిక వేధింపులు, గృహహింస, అత్యాచారాల నుంచి రక్షణ పొందడానికి 181 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 0870 2452112 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అమ్మవారికి పీపీ పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ సోమవారం సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీపీకి అర్చకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం చేశారు.

నేటినుంచి శిక్షణ తరగతులు

ఖిలా వరంగల్: ఈనెల 30, 31వ తేదీల్లో వరంగల్ హంటర్‌రోడ్డులోని పీఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమకాలిన రాజకీయ పరిస్థితులు, సమాజంలో పెరిగిపోతున్న మతోన్మాదం, లౌకికవాదం, మార్క్సిజం అంటే ఏమిటనే అంశాలపై లోతైన శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు.

విద్యార్థి సంఘాలపై ఆరోపణలు సరికాదు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోని నిబంధనలు, ఫీజులపై ప్రశ్నిస్తే విద్యార్థి సంఘాలు బ్లాక్ మెయిల్ చేస్తున్నాయంటూ కళాశాలల యజమాన్యాలు అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకుడు హకీంనవీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక కళాశాలకే అనుమతి పొంది అనే బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి ఫీజుల పేరిట చేస్తున్న దోపిడీ చేస్తూ, ఇందేటని ప్రశ్నించిన విద్యార్థి సంఘాలపై చందాల పేరిట అసత్య ప్రచారాలు చేస్తూ తమ ప్రతిష్టను దెబ్బతీయడం తగదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుస్తుంటే బహిరంగ చర్చకు తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ నాయకులు రావాలని సవాల్ విసిరారు. లక్ష్మణ్, ఓర్సు రాజు, యాకూబ్, రాజేందర్ పాల్గొన్నారు.

గద్దె నిర్మాణంపై ఘర్షణ

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ చిన్న బ్రిడ్జి రోడ్డులోని (మేదరివాడ) భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కార్మిక గద్దె నిర్మాణ విషయంపై కార్మిక సంఘం ప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. కార్మికుల గద్దెను కొంతమంది కూలగొట్టడంతో కార్మిక నేతలు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

గతేడాది కురిసిన భారీ వర్షానికి వాగును తలపిస్తున్న హుజూరాబాద్‌-పరకాల రహదారి (ఫైల్)



పోలీస్ స్టేషన్‌లోకి చేరిన వరద నీటిని ఎత్తి పోస్తున్న కానిస్టేబుల్ (ఫైల్)



ముంపు సమస్యకు ముగింపేది?

- ప్రణాళిక లేమితో ప్రజలకు శాపం
- వర్షాలకు జలమయమవుతున్న కాలనీలు
- ఇళ్లల్లోకి చేరుతున్న వరద, మురుగునీరు
- శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు



ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఓ హోటల్‌లోకి ప్రవహించిన వరదనీరు (ఫైల్)

కమలాపూర్ : వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ కాలనీ వాసుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. భారీ వర్షం కురిసిన ప్రతీసారి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంతో పాటు 11వ వార్డు, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయి. మురుగు, వరద నీరంతా ఇళ్లల్లోకి చేరుతోంది. కాలనీ వాసులు బయటకు వెళ్లాలన్నా, ఇళ్లకు రావాలన్నా ఆ వరదలో నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంటోంది. వరద, మురుగు నీటితో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ కాలనీలు ముంపునకు గురికాకుండా, వరద, మురుగునీరు ఇళ్లల్లోకి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

ప్రణాళిక లేమితో ప్రజలకు శాపం

ముందు చూపు, ప్రణాళిక లేమితో కమలాపూర్ బస్టాండ్, పరిసరప్రాంత ప్రజలకు శాపంగా మారుతోంది. భారీ వర్షం కురిసిన ప్రతిసారి హుజూరాబాద్‌-పరకాల ప్రధాన రహదారిపై వాగును తలపిస్తూ వరదనీరు ప్రవహిస్తోంది. గ్రామంలోని వరద నీరంతా ఇటువైపే వస్తుండగా నీరు వెళ్లేందుకు అనువైన కాల్వలు లేక మురుగు కాలువల్లో చేరి మురుగు, వరద ఏకమై ఇళ్లల్లోకి చేరుతోంది. హుజూరాబాద్‌-పరకాల మార్గంలో నిర్మించిన ఫోర్‌లేన్ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ కారణంగా వరద నీరు అవతలి వైపునకు వెళ్లకపోవడంతో రోడ్డుకు ఇవతలి వైపు ఉన్న ఇళ్లల్లోకి చేరి సముద్రాన్ని తలపిస్తుంది. గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షానికి హుజూరాబాద్‌-పరకాల ప్రధాన రహదారిపై వరదనీరు పెద్దెఎత్తున నిలిచిపోవడంతో డివైడర్లను అక్కడక్కడా ధ్వంసం చేసి వరదనీటిని మళ్లించి చేతులు దులుపుకున్నారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వరదనీరు రాకుండా చేయాలి



భారీ వర్షం కురిసిన ప్రతీసారి బస్టాండ్ ప్రాంతమంతా ముంపునకు గురై వరద, మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. గతేడాది కురిసిన భారీ వర్షానికి మా ఇల్లంతా వరద నీటితో నిండిపోయి ప్రాణ భయంతో వణికిపోయాం. ఈ సారైనా అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఇళ్లల్లోకి వరదనీరు రాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి.

– జడల రమాదేవి, స్థానికురాలు

ముంపునకు గురవకుండా చూడాలి



అనువైన కాల్వలు లేకపోవడంతో వరదనీటితో పాటు మురుగు నీళ్లన్నీ ఇళ్లలోకి వస్తున్నాయి. ఆ నీళ్లన్నీ పోయేదాక కంటి మీద కునుకు లేకుండా రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి బస్టాండ్ ప్రాంతం ముంపునకు గురవకుండా చర్యలు చేపట్టాలి.

– కొలిపాక రాజేందర్, స్థానికుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వరదనీరు వెళ్లేందుకు అనువైన కాల్వ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించి భవిష్యత్‌లో ఈ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతాం. ప్రస్తుతం వరదనీరు చెరువు తూము కాల్వలోకి వెళ్లేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఆందోళన చెందొద్దు.

– గుండె బాబు, జీపీ ప్రత్యేకాధికారి

రాజేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కమలాపూర్ : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకొని మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన మౌటం రాజేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల కార్యదర్శి ఎల్లబోయిన రవీందర్, సమ్మయ్య సోమవారం సంయుక్త ప్రకటనలో కోరారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేశ్ మత్స్య వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని తెలిపారు. అతని మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని విచారణ వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించి డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు.

‘వాసుదేవరెడ్డిపై ఆరోపణలు సరికాదు’

శాయంపేట : వికలాంగుల సంక్షేమశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డిపై రాష్ట్ర మంత్రి సీతక్క ఆరోపణలు చేయడం సరికాదని టీఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మున్నా సోమవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి కీలకపాత్ర పోషించి అనేకసార్లు జైలు జీవితం గడిపిన అతనిపై ఆరోపణలు చేయడం అర్థరహితమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ పెంచి ఇస్తామని ప్రకటించి ఇవ్వకపోవడమే కాకుండా తప్పించుకోవడానికి మార్గాలు వెతుకుతోందని విమర్శించారు. దివ్యాంగుడైన వాసుదేరెడ్డి రాజకీయంగా ఎదుగుతున్నారని జీర్ణించుకోలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆరోణపలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



నిరసన తెలుపుతున్న దళిత ప్రజాసంఘాల జేపీసీ నాయకులు

నర్సంపేట : కబ్జాదారుల నుంచి సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని ప్రొఫెసర్ గడ్డ వెంకటేశ్వర్లు, దళిత ప్రజాసంఘాల జేపీసీ కన్వీనర్ కల్లేపల్లి ప్రణయ్‌దీప్, కోకన్వీనర్ గుంటి వీరప్రకాశ్, మంద ప్రకాశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో దళిత ప్రజాసంఘాల జేపీసీ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, డీపీఆర్‌పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, ప్రణయ్‌దీప్, వీరప్రకాశ్, మంద ప్రకాశ్ మాట్లాడారు. సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల బారి నుంచి కాపాడుతున్న దళితులపై పెండ్యాల యాదగిరి, మండల శ్రీనివాస్ పోలీసులను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయించారని, నోటీసులు ఇప్పించారని ఆరోపించారు. యాదగిరి, శ్రీనివాస్‌లు సర్వే నంబర్ 121ని 129గా సృష్టించి ఆ పేరుతో మున్సిపాలిటీ నుంచి ఇంటి నిర్మాణ అనుమతి పొందారని చెప్పారు. శ్రీనివాస్‌ను బాడుగ నేతగా అభివర్ణించారు. భూమి చరిత్ర తెలియకుండా దళిత నేతలపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. అధికారులు 15 రోజుల్లో భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకోకపోతే బడుగు, బలహీన వర్గాలతో గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేదారి, ఆగారపు స్వామి, బాణాల శ్రీను, మాదాసి రవి, కోడి భాస్కర్, చింతం సిద్దూ, గునిగంటి ఈశ్వర్, గద్ద అఖిల్, ఇస్రం కుమార్, గద్ద సారంగం, వేల్పుల సురేష్, మల్లయ్య, మిట్టగడుపుల మల్లయ్య, దామెర సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే మానవాళికి ప్రాణాధారం

మామునూరు: మొక్కలే మానవాళికి ప్రాణాధారమని రంగశాయిపేట డెవలప్‌మెంట్ కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్, గణేశ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్ సూచించారు. వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాస్, రాధాకిషన్, సారంగం, సుతారి రాజు, బండి అశోక్, ఆలయ పూజారి వేణునాథాచార్యుల ఆధ్వర్యంలో పలు రకాల మొక్కలను సోమవారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, రవిబాబు, వెంకట్ రవి, బాబు, కిరణ్, రాకేష్, సుమన్, పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత

ఖిలా వరంగల్: మిస్సింగ్ కేసును వరంగల్ మిల్స్ కాలనీ పోలీసులు ఛేదించారు. కరీమాబాద్ ఆర్‌ఆర్ తోటకు చెందిన గోనెల లింగమూర్తి, వనమాల దంపతులు గొడవ పడ్డారు. దాంతో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఈనెల 5వ తేదీన రాజ్‌కుమార్ ఇంటిలో నుంచి బయటికి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దాంతో ఈనెల 8న మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రాజ్‌కుమార్ ఆచూకీని కనిపెట్టి కుటుంబ సభ్యులకు ఇన్‌స్పెక్టర్ మల్ల య్య సోమవారం అప్పగించారు.

కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు

వేలేరు : మండలంలోని పీచర శివారులో గల వెంకటశ్రీ స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేలేరు పీహెచ్‌సీ డాక్టర్ వైశాలి సోమవారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, వైరల్ ఫీవర్, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. రవికిరణ్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వైశాలి

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజం



బదిలీ ఉద్యోగిని సన్మానిస్తున్న రవీందర్‌రావు

ఐనవోలు : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణ అధికారిగా విధులు నిర్వహించి వరంగల్ జిల్లా నర్సంపేట బానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళ్తున్న రాజేంద్ర ప్రసాద్‌ను సోమవారం ఆయన శాలువాతో సన్మానించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పల్లకొండ చిన్నమల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. చిన్నమల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఇటీవల మహ్మద్ గౌస్‌పాషా కుమారుడు మృతిచెందగా వారి కుటుంబాన్ని, అనారోగ్యంతో బాధపడుతున్న సమ్మయ్యను పరామర్శించారు.

కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

ఖిలా వరంగల్: జాతీయ ఉపాధి హామీ పనులకు కేంద్రం రూ.2.70 కోట్ల నిధులు కేటాయించాలని, వ్యవసాయ కూలీలకు కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో హంస మంజుల అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం చేసి అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచి అమలు చేయాలని ఆయన కోరారు. ఆగస్టు 3, 4వ తేదీల్లో వేములవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిలువేరి విజయ, రమేష్, పిట్టల సతీష్, జాన్‌పాల్, భాగ్య, చింతల సారయ్య, అశోక్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టి.. మాయచేశాడు

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మామిండ్లపల్లి సారంగపాణి, ధనలక్ష్మి దంపతులు తమ కుమార్తెల పెళ్లి కోసం వారు భూమిని విక్రయించారు. ఈ క్రమంలో వారి సమీప బంధువైన వరంగల్ ఎస్‌ఆర్‌నగర్ కాలనీకి చెందిన క్షుద్ర పూజారి కుదురుపాక వెంకటేశ్వర్లు(55).. వారి వద్ద ఉన్న నగదుపై కన్నేశాడు. ఆడపిల్లల పెళ్లికి కట్నం కింద ప్లాటు చూపిస్తే సరిపోతుందని నమ్మించాడు. ఈ క్రమంలో వరంగల్ వివేకానంద కాలనీకి చెందిన కె.సతీష్ 266 గజాల ఇంటి స్థలాన్ని రూ.30.21 లక్షలకు బయానగా రూ.20 లక్షలు చెల్లించారు. ఎవరికి తెలియకుండా మిగతా డబ్బులు చెల్లించి వెంకటేశ్వర్లు తన పేరిట ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. పలు రకాలుగా నమ్మిస్తూ మొత్తం రూ.36 లక్షలు తీసుకుని ముఖం చాటేశాడు. దాంతో ఈనెల 20న మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో కుదురుపాక వెంకటేశ్వర్లు, అతడి కుమారుడు జయప్రకాశ్‌పై బాధితులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం వెంకటేశ్వర్లును విచారిస్తుండగా మిల్స్‌కాలనీ పోలీసులు తన నాన్నను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ జయప్రకాశ్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసుల జోక్యంతో కిందికి దిగాడు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ఎంజీఎం: కార్మికవర్గ హక్కులు, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఆగస్టు 4న వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎంజీఎం సెక్యూరిటీ గార్డ్స్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఎంజీఎం ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని చేసి ఇప్పుడున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, తదితర డిమాండ్లతో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంజీఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది గొర్రె నాగరాజు, రాజుబోయిన రాజు, తుల సుధాకర్, కందుకూరు పుష్ప, రాజావీర్, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, సుద్దాల నాగరాజు, చందు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేలేరు (ధర్మసాగర్) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ధర్మసాగర్ పీహెచ్‌సీ డాక్టర్ గోపీనాథ్ అన్నారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో సబ్ యూనిట్ కోఆర్డినేటర్ పరంజ్యోతి, పల్లె దవాఖాన వైద్యాధికారి మహేందర్‌రావు పర్యవేక్షణలో వైద్యశిబిరం, డ్రై డే కార్యక్రమాలు చేపట్టారు. మురికి కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసన్న, హెచ్‌ఈఓలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మురికి కాల్వలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

‘సినారె’ కు నివాళి

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కేజీబీవీలో సినారె (సింగిరెడ్డి నారాయణరెడ్డి) జయంతిని సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డి సందేశాన్ని 10వ తరగతి విద్యార్థిని సుష్మ ఉపన్యాసంతో, శ్రావ్య, సౌమ్య కవితల రూపంలో వినిపించారు. అనంతరం బోనాల వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజస్విని, దేవిక, కమల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బాలల అభివృద్ధికి ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరశురాములు

కాశిబుగ్గ: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, అలాంటి బాలల అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ చేయూతనందించాలని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మండల పరశురాములు పిలుపునిచ్చారు. శివనగర్ ప్రాంతంలోని డాన్‌బాస్కో బాలల గృహంలో బాలల అభివృద్ధి – సమాజ బాధ్యతపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ, సంరక్షణ శారీరక, మానసిక అభివృద్ధిపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలలు సమాజానికి అతి ముఖ్యమైన వనరులని, వారికి సరైన విద్య, ఆరోగ్య, సాంఘిక సేవలు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డాన్‌బాస్కో సిబ్బంది దివ్య, శారద, రాజు, అనిత, భారతి, ఉల్లాస, వసంత, జ్యోతి, బాలల హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధకారంలో అంబేడ్కర్ సెంటర్

వేలేరు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు కాలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అంబేడ్కర్ సెంటర్ అంధకారంలో మగ్గుతోంది. పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదని పలువురు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

